కథ

# ఒంటెద్దు బండి

- జి.సి.జీవి

''ఒక కథ చెపుతాను వింటావురా?''

''చెప్పండి తాతా''


''అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఒక్కతే కూతురు అనే కథ కాదది. చానాయేళ్ళ కింద జరిగింది''.

''నిజంగా జరిగిందా?''

''ఆఁ''

''అయితే చెప్పండి''

ఒంటెద్దు బండి సంస్కృత పాఠశాల మీదుగా కుడివేపుకి తిరిగి రాజాగారి వీధి గుండా పోతున్నది. బండి తోలే తాత బండివాడిలా కనిపించడం లేదు. తెల్లని ఖద్దరు లాల్చీ అంతకన్నా తెల్లని పొందూరు ధోవతి ధరించి వున్నాడు. ఎద్దు తోకకి తగిలి ధోవతి మరకలవకుండా మడిచి తొడల కిందికి లాక్కున్నాడు. తలపాగకి బదులు తెల్లగా పండిన క్రాపు. ముసలి పెళ్ళికొడుకు వలె వున్నాడు. ఆటోలు రిక్షాలు తిరిగే వీధిలో ఒంటెద్దు బండిని వింతగా చూస్తూ పోతున్నారు కొందరు.



''అప్పుడీ మూలాపేటలో యిన్ని ఇళ్ళు లేవు, యిన్ని బళ్ళు లేవు. ఇదిగో ఈ వీధి చివర ఆ ఫ్లాట్లు కనపడుతున్నాయే అక్కడ అందమైన పూల తోట వుండేది. పొద్దు గూకిందంటే చాలు మల్లెలు, సన్నజాజులు, గులాబీలు, మనోరంజితాల వాసనతో ఈ మూలాపేటంతా గుబాళించేది''-

బండి వీధి చివరికొచ్చింది. చెరువుకట్ట మొదలైంది. కట్టమీద ఇరగాళమ్మ గుడిలో గంట మోగుతూంది. కుడి వేపున ఇంకా మిగిలివున్న పొలాలు.

''అసలు కథ చెప్పండి తాతా''.

''వస్తున్నా'' అంటూ ఎద్దుని అదిలించి కథ చెప్పసాగేడు తాత-.....

అనగనగా ఆరోజు ఇలాటి సందేళ ఇదే రోడ్డమ్మట ఒక ఒంటెద్దు గూడుబండి సాగిపోతూ వుంది. చుట్టూపచ్చని పంట చేలు. అల్లంత దూరాన ఒక ఆడమనిషి ఒంటరిగా నడిచిపోతూ వుంది. చంకలో పసిబిడ్డ. ఒక చేతిలో సంచి. ఎద్దుని అదిలించాడు. బండి ముందు కురికింది.

ఆడమనిషి బాగా దగ్గరైంది. చిక్కినట్టు కనిపిస్తున్నా చక్కగా వుంది. ముఖంలో లక్ష్మీదేవి కళ. ఆమెని చూస్తుంటే కామాక్షి తాయిని చూస్తున్నట్టుగా వుంది.

''బండెక్కుతావా?'' అడిగేడు బండి తోలే అతను.

ఒకసారి తిరిగి చూసి బదులు చెప్పకుండా నడుస్తూ వుంది ఆమె.

''ఫరవాలేదు ఎక్కు. డబ్బులడగన్లే''.

మాట్లాడకుండా నడుస్తూ వుంది. పక్కనే బండి సాగుతూ వుంది. కొంచె దూరం పోయాక చంకలో బిడ్డ బండికేసి చూపి బుల్లి చేతులూపసాగింది. ఏమనుకుందో ఏమో బిడ్డని బండిలో కూచోబెట్టింది. పక్కనే సంచి కూడా పెట్టేసి బండి కమ్మిని పట్టుకుని నడుస్తూ వుంది. మరికొంచెం దూరం పోయేక బండాగింది.

''ఎంతదూరమని యిట్లా నడుస్తూ వస్తావు. నిన్నేమి మింగెయ్యన్లే. బెట్టు చెయ్యకుండా బండెక్కు'' కొంచెం కోపంగా అన్నట్టు చెప్పాడు.

అతనికేసి ఒకసారిచూసి బండెక్కి కూర్చుని బిడ్డని వొళ్లోకి తీసుకుంది. ఆ పాపకి మూడేళ్ళుంటాయి. ముద్దొచ్చేట్టుంది.

''కొంచెంగా పైకి జరిగికూర్చో'' చెప్పాడు బండతను.

చీకటి పడింది.

''ఈ వేళకి ఎక్కడికి బయలుదేరినావు ఒక్కదానివే?'' ఆమె పలుకలేదు.

''పోనీ యిష్టం లేకపోతే చెప్పొద్దులే''

''నరసింహకొండకి'' చెప్పింది చిన్నగా

''మొక్కుబడా?''

''కాదు''

''మరి?''

''ఇదుగో దీని నాయన అక్కడ రోగంతో పడి వున్నాడంట. ఒకసారి బిడ్డని చూడాలనుందని కబురెట్టినాడు. అందుకే పోతూన్నా''.

''అంటే మీ యిద్దరూ కలిసుంటం లేదా?''

''లేదు. నా మొగుడు నన్నొదిలేసి పోయి రెండేళ్ళయింది''.

''ఏం జరిగిందేం?''

''ఇదుగో దీన్ని కడుపుతో వున్నా. నాకు సాయంగా వుంటుందని చెల్లిని నా దగ్గర పెట్టిపోయింది మా అమ్మ. అప్పుడు దానికి పదమూడేళ్ళు. పదిహేడేళ్ళ పిల్లలా ఎదిగింది. ఇది పుట్టిన్నాడే అది సమర్తాడింది. పురుడైపోయి నా పన్లు నేను చేసుకునే సత్తావొచ్చాక ఇంక వూరికి బయల్దేరవే. అక్కడ అమ్మ ఒంటిగా అవస్తలు పడతావుందో ఏమో అన్నా. 'పాపని వొదిలిపోడానికి మనసొప్పడం లేదక్కా. ఇంకొన్నాళ్ళుండి పోతానే' అని బతిమాలింది. సరేలే అనుకున్నా. కాని యేడాది తిరిగే సరికి నా చెల్లే నాకు సవితై కూర్చుంటదనుకోలా. బావతో పడుకుని కడుపు తెచ్చేసుకుంది. గోలగోలగా చేసినా. నెత్తీనోరూ కొట్టుకున్నా. పంచాయితీ పెట్టించినా, నా చెల్లిని రెండో మనవాడతానన్నాడు నా మొగుడు. 'పరాయి పిల్లేం కాదు కదమ్మా? తోడబుట్టిందే కదా? ఒప్పేసుకో' అన్నారు వూరి పెద్దమనుషులు. నే నొప్పులా. ఆ రాత్రి యింట్లో పెద్దగొడవ జరిగింది. వాడు నన్ను కొట్టేడు. నేనూ ఎదురు తిరిగినా. ఈ యింట్లో నేనయినా వుండాల లేదా మీరైనా వుండాల అని తెగేసి చెప్పినా.

పసికందుని తీసుకుని ఎక్కడికనిపోతావు. మీ అమ్మ కూడా సరేనంటావుంది కదా?' అన్నాడు.

తెల్లారేతలికి వాళ్ళిద్దరూ పత్తాలేరు. ఎక్కడ చచ్చారో ఏమో నేను పట్టించుకోలా'' ఆమె చెప్పడం ఆపింది.

ఒకసారి వెనక్కి తిరిగి చూసాడు బండతను. ఆమె ముఖంలో ఎటువంటి భావమూ లేదు. నిమ్మళంగా వుంది.

''నీ మొగుడికేం పని?''

''మేం మేదరోళ్ళం. చేటలు, తట్టలు, బుట్టలు అల్లి అమ్ముతుంటాం'' చెప్పింది.

జోరుగా గాలి వీచింది. మబ్బులు కమ్ముకుంటున్నాయి.

''నరసింహకొండ దగ్గర ఏం చేస్తున్నాడంట మీ ఆయన''.

''సారా బట్టి నడుపుతున్నాడంట''.

''మీ చెల్లెట్లా వుంది?''

''బిడ్డని కని పురిట్లోనే సంధికొట్టి బిడ్డా అదీ చచ్చిపోయేరు''.

చినుకులు ప్రారంభమైనాయి. చూస్తుండగానే వర్షం పెద్దదయింది. బండిలోకి జల్లు కొడుతూ వుంది. పసిపిల్ల చలికి యేడుపు కెత్తుకుంది. సంచిలోంచి చీర తీసి బిడ్డకి కప్పి గుండెలకి హత్తుకుంది ఆమె.

ఎదురుగాలికి ఎద్దు నడవలేక పోతూ వుంది. ఆకాశం పెద్దగా వురిమింది. ఉలిక్కిపడి బిడ్డ కెవ్వుమంది. దారంతా చీకటిగా వుంది. మెరుపుల వెలుగులో అల్లంత దూరాన వూడల మర్రి. హెయ్... హెయ్... అని ఎద్దుని అదిలిస్తూ ఎట్టాగో బండిని చెట్టుకిందికి చేర్చాడు.

ఆకలికి బిడ్డ ఏడుస్తూ వుంది.

''వాన ఆగేదాకా ఇక్కన్నించి కదల్లేం'' వెనక్కి తిరిగి చూసి చెప్పాడు.

రవిక ముడివిప్పి పాపకి పాలిస్తున్న ఆమె అతనిటు తిరగ్గానే వెనక్కి జరిగింది.

''ఇంకొంచెం పైకి జరిగి కూర్చో. పాప తడిసిపోద్ది. నేకిందికి దిగతాలే'' అన్నాడు బండి మీంచి దిగే ప్రయత్నం చేస్తూ.

''ఒద్దొద్దు తడిసిపోతావ్'' సర్దుకుని కూర్చుంటూ చెప్పింది.

'నువ్వెక్కడికి పోతున్నా'' అడిగింది.

''జొన్నాడికి'' వెనక్కి తిరిగి చూడకుండా చెప్పాడు.

''మొక్కుబడా?''

నవ్వేడు. ''అదేం లేదు. రేపట్నించి తిరణాళ్ళ కదా. బండికి బాగా బాడుగలు గిట్టుబాటవుతాయ్''.

బండిలో కూర్చునే తల్లీ బిడ్డా నిద్రపోయేరు.

బండతనికి నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలు.

ఒకసారి వెనక్కి తిరిగి చూసాడు.

రవిక ముడివేసుకోవడం కూడా మరచిపోయి నిదురిస్తూ వుంది ఆమె.

క్రమంగా వర్షం తగ్గుముఖం పట్టింది.

తెల్లవారింది. లే యెండ పొడలు వ్యాపిస్తున్నాయి.

బండి కదిలి ముందుకి సాగిపోతూ వుంది.

దారిపక్క చెట్టుకింద పాక హోలు ముందు బండి ఆపాడు.

వేడి వేడి ఇడ్లీలు, టీ గ్లాసు తెచ్చి ఆమెకిచ్చాడు.

కవిత



## మనిషిచేత మనిషికొరకు మనిషి వలన

మనిషి తలపోసేది కేవలం మనిషికొరకే
మనిషే మనిషి సంపద
అన్నింటికన్నా గొప్పనిధి అతడే
మనిషే మనిషికీశ్వరుడు
తిరిగి అతడి కతడే యేకైక శత్రువు
అయినా సరే
ఈ మనిషిలేని సృష్టి నిరర్థకమే మరి

అనైక్య జీవనం వల్లే
మనిషి సాధించిన శ్రమసంపదంతా పాడయ్యేది
శ్రమేలేని జీవితం మానవుడులేని ప్రపంచంలాంటిదే
అతడు లేని మాతృభూమి మరింత శూన్యమైందే
సదుద్దేశ్యసంతానం వల్లే యోగ్యతల తలంపుల వల్లే
భూదేవి వొంటరితనం పారిపోగలదు

ఒక కొండవాగు అలలతుంపరలు
పుష్పసుగంధాలు
మన హృదయాల్ని చలింప చేస్తాయి
జీవితం ఆశయానందంతో నిండిపోగలదు
తీయని పలుకులు ఉన్నత నడవడి వదన దరహాసాలు
ఇలా తొణికిసలాడే ప్రపంచమంతా
మనిషి సత్కలాపాల సాఫల్యాలవల్లే సఫలమయ్యేది సార్థకమయ్యేది

(సంతాళి భాషలోని ఆదిత్యకుమార్ మండి కవితకు స్వేచ్ఛానువాదం)

-నాళేశ్వరం శంకరం

బిడ్డకి యిడ్లీ తినిపించింది. సంచిలోంచి స్టీలు గ్లాసు తీసి టీ చల్లార్చి కొంచెం బిడ్డకి తాపించి మిగిలింది తను తాగింది. మిగిలిన యిడ్డెన్లని పొట్లం కట్టి సంచిలో పెట్టుకుంది. తనూ టిఫిన్ చేసి వచ్చి బండెక్కాడు అతను.

పెన్నా నది వొంతెన కాడికొచ్చింది బండి.

''ఇక్కడాపు దిగిపోతా'' అంది ఆమె బిడ్డని భుజానికెత్తుకుని

''ఏం, నరసింహకొండ దాకా వస్తాలే'' అన్నాడు వెనక్కి తిరిగి ఆమెకేసి చూస్తూ.

''ఒద్దొద్దు. నడిచిపోతా. దగ్గిరే కదా?''

''సరే నీ యిష్టం''

బిడ్డ నెత్తుకుని బండి దిగింది. సంచి తీసి పట్టుకుని

''వొస్తా'' అంటూ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకి కదిలిపోయింది.

మూడో రోజు ఉదయం పెన్నానది వంతెన దాటి ఎడం వేపుకి తిరిగింది ఒంటెద్దు బండి. దారిపక్కన రావిచెట్టు కింద నిలబడి వుంది ఆమె. ఆమె పాదాల దగ్గర నేల మీద చతికిలబడి మట్టిలో కెలుకుతూ వుంది ఆమె పాప.

''ఏందిక్కడ నిలబడి వుండావు?'' అడిగాడు బండతను బండాపి.

''బస్సు కోసం'' చెప్పిందామె.

''ఎప్పుడొస్తాదో ఏమో. వచ్చినా ఆ జనంలో పాప నెత్తుకుని నువ్వెక్కలేవు. బండెక్కుపోదాం''.

ఆమె కదల్లేదు.

''వచ్చేటప్పుడు కలిసే వొచ్చాం కదా. ఇప్పుడే మొచ్చింది?

నిన్ను మింగెయ్యనులే. రా పోదాం''.

బిడ్డ చేతులకంటిన మట్టి దులిపి చంకకెత్తుకుని బండిని సమీపించింది. పాపని బండిలో కూచోబెట్టి పక్కనే చేతి సంచిని పెట్టింది. చెక్క పలకమీద కాలు మోపి చక్రం పట్టుకుని బండెక్కింది.

ఎద్దుని అదిలించాడు. ఒక్క కుదుపులో బండి ముందుకి సాగింది.

''నువ్వు మీ ఆయన కలిసొస్తారనుకున్నానే. నువ్వు మాత్రం వచ్చావేంది?''

ఆమె ఏమీ మాట్లాడలేదు.

''చెల్లెలు పోయింది కదా. ఇప్పుడైనా యిద్దరూ కలిసుండొచ్చు కదా?''.

''......... ....''

''మాట్లాడవేంది?''

''ఒకసారి కుండ పగిలేక మళ్ళీ అతుకుద్దా?''

అతని కేమనాలో తోచలేదు.


''మీ ఆయన కెట్లా వుంది?''

''నే వెళ్ళేసరికి గుంటలో పెట్టటం కూడా అయిపోయింది. చూపులు కూడా దక్కలే''.

వెనక్కి తిరిగి చూసాడు ఆమెకేసి. ముఖం బోసిగా వుంది. బొట్టు లేదు.

ఎద్దు చటుక్కున ఆగిపోయి ముందుకి సాగనని మొరాయించింది. దాని ముడ్డి కింద చెయి పెట్టి గిలిగింతలు పెట్టాడు. ముందుకి కదిలింది.

''తిరణాళ్ళ బాగా జరిగిందా?''



''చానా బాగా జరిగిందిలే ఈసారి. నిరుటికంటే జనం బాగా వొచ్చేరు. మద్రాసు నించి సినిమా వాళ్ళని రప్పించి పాట కచేరి కూడా పెట్టించారు. నాక్కూడా రెండొందలకి పైనే బాడుగ కిట్టింది'' అని కొత్తగా కొన్న ప్లాస్టిక్ సంచిలోంచి బిస్కెట్ పాకెట్ తీసి పాప చేతికిచ్చాడు. పాకెట్ అటూ యిటూ తిప్పుతూ దానిమీది రంగుబొమ్మల్ని చూడసాగింది పాప.

''ఎన్నాళ్ళని యిట్లా వుంటావు మగ తోడు లేకుండా?''

''నా బిడ్డే నాకు తోడు''.

''నే నో మాటడుగుతా కోపం తెచ్చుకోవు కదా?''

''కోపం తెప్పించే మాటే అయితే ఎందుకు తెచ్చుకోను'' బండాయన పకపక నవ్వేడు.

''నీకు కోపమొచ్చినా సరే నా మనసులో మాట ఇంక దాచుకోలేను. అడిగేస్తా'' అని కాసేపాగి.

''నన్ను చేసుకుంటావా? నాకూ ఎవరూ లేరు. నిన్ను బంగారంగా చూసుకుంటా. నీ బిడ్డని నా బిడ్డగా సాకుతా, మనకెందరు పిల్లలు పుట్టినా సరే''.

ఆమె ఏమి సమాధానం చెప్పకుండా మెలమెల్లగా పైకి జరిగింది. అతని వీపుకి తన వీపు ఆనించింది. తన వొళ్ళోని పాపనెత్తి అతని వొళ్లో పెట్టింది. ఎడం చేత్తో పాపని ప్రేమగా పొదివి పట్టుకున్నాడు.

హుషారుగా హోయ్... హోయ్... అంటూ ఎద్దుని అదిలించాడు. బండి వేగంగా పరిగెత్తసాగింది.

ఆడ దిక్కులేక అల్లకల్లోలంగా పడున్న ఇంటిని చక్కదిద్దింది. భర్తకి నచ్చజెప్పి ఎద్దుని బండిని అమ్మించింది. వచ్చిన డబ్బుతో మంచి సీమ పేము తెప్పించింది. తన హస్త నైపుణ్యంతో అందమైన మోడాలు, టీపాయ్‌లు, పేము కుర్చీలు, ఉయ్యాలలు తయారు చేసింది. సామాన్యంగా పేముకి వార్నిష్ తప్ప రంగులు అంటవు. కాని కనువిందు చేసే రకరకాల రంగులు వేసింది. ఆ రంగుల రహస్యమేమిటో ఎందరు నిపుణులు వచ్చి అడిగినా చెప్పలేదు. ఆమె చేత్తో తయారుచేసిన పేము ఫర్నిచర్ చకచకా అమ్ముడు పోయింది. బయట ఊర్ల నించి ఆర్డర్లు సాగినయ్. అయిదేళ్ళు తిరిగే సరికి ట్రంకు రోడ్డులో షాపు తెరిచింది. ఇప్పుడీ వూళ్ళో పేరున్న పెద్ద ఫర్నిచర్ షాపు వాళ్ళదే...

తాత కథ చెప్పడం అయిపోయింది. వెనక్కితిరిగి చూసాడు. మెదలకుండా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు మనవడు.

''తాతా నాకో సందేహం'' అన్నాడు మనవడు.

''అడుగు'' అన్నాడు తాత ఎద్దు తోక కింద చెయి వేసి గిలిగింతలు పెడుతూ. వేగం పుంజుకుంది బండి.

''అమ్మమ్మ అంత అందైమంది కదా. ఏం చూసి చేసుకుంది నిన్ను?''

''హరి భడవా'' అంటూ హాయిగా నవ్వేసాడు తాత.

పెన్నానది వంతెన మీద ఒంటెద్దు బండి సాగిపోతూ వుంది.

అవతలి గట్టు మీద జొన్నవాడ కామాక్షమ్మ గుళ్ళోంచి డప్పుల మోత లయగా వినిపిస్తూ వుంది.

✻

రచయిత సెల్ నెం. 09710483908